క్లుప్తంగా

పరామర్శ



మృతుడి భార్యను ఓదారుస్తున్న క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామ బీఆర్ఎస్ కార్యకర్త బేగరి రాములు అకాల మరణంతో శుక్రవారం అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రాములు మృతదేహానికి నివాళులర్పించి, తక్షణ ఆర్థిక సాయంగా నగదును వారి కుటుంబ సభ్యులకు అందించారు. చిన్నారుల చదువులతో పాటూ వారి కుటుంబానికి అండగా ఉంటానని క్రాంతికిరణ్ హామీ ఇచ్చారు. రాములు ఇద్దరి కుమార్తెల ఒక్కొక్కరి పేరున రూ. లక్ష చొప్పున రూ.రెండు లక్షలను అందిస్తానని, వారి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలన్నారు. గ్రామానికి చెందిన ఉప్పు శంకరప్ప రూ. 50వేల చొప్పున ఇద్దరి చిన్నారులకు రూ. లక్ష చెక్కును అందించగా, గ్రామానికి చెందిన అవినాష్ రూ.20వేలు నగదు ఆర్థిక సాయాన్ని అందించారు. మృతుడి మిత్రులు, గ్రామ పెద్దలు, యువకులు అందరు కలిసి చందా రూపకంగా వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.1లక్ష, 26వేల నగదును అందించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

వృథాగా నల్లా నీరు
పట్టించుకోని అధికారులు



జంగరాయిలో వృథాగా పోతున్న తాగునీరు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామంలో పబ్లిక్ ట్యాప్‌కు నల్లా లేక పోవడంతో నల్లానీరు వృథాగా పోతోంది. మంచినీటి సరఫరా జరిగినంతసేపు నీరు వృథాగా పోతోంది. దీంతో చాలా మందికి అవసరమైన తాగునీరు లభించని పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నా.. మనకెన్నొస్తాయి ?
ఆరా తీస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): అన్న మన ఊర్లో మనకెన్నోస్తాయి అంటు ఆయా పార్టీల నాయకులు గ్రామాల ముఖ్య నాయకులను ఆరా తీస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దీంతో ఇక ఫలితాలపై అభ్యర్థుల అనుచరులు అంచనాలు వేసుకుంటున్నారు. ఇప్పటికే వచ్చిన ఎగ్జిట్ పోల్స్ సర్వేలతో ఆయా పార్టీలో ఉత్కంఠ నెలకొంది. మండల స్థాయి నాయకులు గ్రామాల నాయకులు, సర్పంచ్‌లను మకెన్నొస్తాయి అంటూ ఆరా తీస్తున్నారు. ఎవరి అంచనాలు వారు చెబుతున్నప్పటికీ లోలోనా ఉత్కంఠ పడుతున్నారు. అభ్యర్థి గెలుపు ఓవైపు ఉంటే అసలు మన మండలం లీడ్ ఇస్తుందా లేదా మన గ్రామం లీడ్ ఇస్తుందా లేదా చర్చ కొనసాగుతోంది. ఓటర్ నాడి తెలిసినట్టే అనిపిస్తున్నప్పటికీ.. పట్టుకోవడం కష్టంగా మారిందని నాయకులు టెన్షన్ పడుతున్నారు. ఎవరు గెలుస్తారో తెలియాలంటే ఎన్నికల ఫలితం కోసం ఆదివారం వరకు వేచిఉండాల్సిందే.

సోనుసూద్ విగ్రహం పరిశీలన

మద్దూరు(హుస్నాబాద్): సోనుసూద్ సేవా సంస్థ కార్యకర్త గుల్షాన్ ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం దుబ్బాతండా పంచాయతీ పరిధిలోని సోనుసూద్ విగ్రహాన్ని పరిశీలించారు. మద్దూరు ఉమ్మడి మండల పరిధిలోని దుబ్బతండా గ్రామ పంచాయితీకి చెందిన రాజేశ్ గతంలో సోనుసూద్ విగ్రహాన్ని నెలకొల్పాడు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

గజ్వేల్‌రూరల్: కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు భక్తులపై ఎల్లప్పుడు ఉండాలని గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించగా మహిళా భక్తులు సామూహిక వాసవి కన్యకా పరమేశ్వరి పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎర్రం శ్రీనివాస్, సిద్ధి బిక్షపతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎవరి లెక్కలు వారివే...

- ఓట్ల లెక్కల్లో పార్టీల నాయకులు



ఎన్నికల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన రెడ్డిపల్లి ఓటర్లు (ఫైల్)

చేగుంట(తూప్రాన్): ఎన్నికల ప్రక్రియ పూర్తయి ఓట్ల లెక్కింపు కోసం ఇంకా 24 గంటల సమయం ఉండగా, తమ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయనే లెక్కల్లో నాయకులు బీజీగా ఉన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని ఉమ్మడి చేగుంట మండలంలో ఏ పార్టీకి మెజార్టీ ఓట్లు వస్తే అదే పార్టీ విజయం సాధించడం ఖాయమనే నానుడి ఉంది. చేగుంట మండలం దుబ్బాక నియోజకవర్గంలో కలిసిన మొదటిసారి జరిగిన 2009 సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి చేగుంట మండలం నుంచి వచ్చిన 1300 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన చెరుకు ముత్యంరెడ్డి గెలుపొందారు. తర్వాత తెలంగాణ ఏర్పాటు అనంతరం జరిగిన రెండు ఎన్నికల్లో దివంగత నేత రామలింగారెడ్డి టీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. రామలింగారెడ్డి మరణం అనంతరం 2018లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఉమ్మడి చేగుంట మండల ఓటర్లు ఇచ్చిన 1734 ఓట్ల మెజార్టీతో గెలుపొంది రాష్ట్ర స్థాయిలో సంచలనం సృష్టించారు. తిరిగి మూడోసారి జరుగుతున్న సాధారణ ఎన్నికల్లో ఎవరి తలరాతను చేగుంట మండల ఓటర్లు తిరగరాస్తారో అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. గురువారం జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి చేగుంట మండలంలో 36518 ఓట్లు పోలైన్నాయి. బీజేపీ నాయకులు తమకు 18 వేలకు పైగా ఓట్లు పడతాయనే ధీమాతో ఉండగా, బీఆర్ఎస్ నాయకులు మాత్రం 20 వేల ఓట్లు సాధిస్తామనే ధీమాతో ఉన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీకి సైతం సైలెంట్ జరిగినట్లు గ్రామాల్లోని ఓటర్లే చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్‌కు పోలైన ఓట్లు ఎవరికి లాభం చేస్తాయో ఎవరి కొంపముంచుతాయో అని ఎన్నికల విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్వామీజీ

నర్సాపూర్: పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ ప్రైవేట్ వెంచర్‌లో నిర్మించ తలపెట్టిన శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం శ్రీత్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పూజలు చేసి శంకుస్థాపన చేశారు. వెంచర్‌కు ఇటీవల ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. దీంతో వెంచర్‌లో ఆలయ నిర్మాణానికి వెంచర్ నిర్వాహకులు రాఘవేంద్రరావు ఇతర భాగస్వాములు నిర్ణయించారు. అందులో భాగంగా శుక్రవారం స్వామితో శంకుస్థాపన చేయించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీమంత్రి సునీతారెడ్డితో పాటు నాయకులు నవీన్‌రావు, అశోక్‌గుప్తాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

లీజుకు ఆలయ భూమి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామ శివారులోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన వ్యవసాయ భూమిని ఏడాది కాలపరిమితికి వేలం పాట వేస్తున్నట్లు ఆలయ కార్య నిర్వాహక అధికారి విశ్వనాథశర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు అనంతసాగర్ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు వేలం పాటలో పాల్గొని దేవాలయ భూమిని లీజు ద్వారా హక్కు పొందవచ్చని పేర్కొన్నారు.

ఆలయ నూతన కమిటీ

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని శ్రీ మహంకాళీ ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్కల స్వామి, ఉపాధ్యక్షుడిగా తోకల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా స్వామి, సహాయ కార్యదర్శిగా తోట వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా మహిపాల్‌రెడ్డితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణను శుక్రవారం కరీంనగర్‌లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి తదితరులు కలిసి ఎన్నికల సరళిని చర్చించారు. కాంగ్రెస్ విజయం సాధిస్తుందని తెలిపారు. అనంతరం ఆయనను సన్మానించారు.



కవ్వంపల్లి సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

వాష్‌రూమ్‌ల క్లీనింగ్



వాష్‌రూమ్‌ని క్లీనింగ్ చేస్తున్న సిబ్బంది



క్లీనింగ్ అనంతరం వాష్ బేసిన్

సాక్షి ఎఫెక్ట్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయ వద్ద నెలకొన్న భక్తుల ఇబ్బందుల గురించి 'సాక్షి' దినపత్రికలో 'ఆదాయం ఉన్నా.. వసతులు సున్నా' కథనం ప్రచురితం అయింది. అందుకుగాను ఆలయ సిబ్బంది స్పందించి అపరిశుభ్రంగా ఉన్న అద్దె గదులను శుభ్రం చేయించడంతో పాటు వాష్‌రూమ్‌ని క్లీనింగ్ చేయించారు. రెండు రోజుల్లో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు షెడ్డు ఏర్పాటు చేయిస్తామని ఆలయ ఈఓ సార శ్రీనివాస్ తెలిపారు.

చలో ఢిల్లీకి తరలిరండి

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్ట సాధనకు ఈనెల 4న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి దళిత బహుజనులు తరలిరావాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లింగుపల్లిలో శుక్రవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్త ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అటకెక్కించి భారత రాజ్యాంగ స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీ విధి విధానాలను ప్రతిఘటిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డీబీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

జోరుగా మట్టి దందా!



తిప్పారం గ్రామ శివారులో టిప్పర్‌లో నింపుతున్న మట్టి



మల్లన్నసాగర్ కాలువ పక్కన అక్రమంగా తరలించిన మట్టి

- లక్షలు గడిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

కొండపాక(గజ్వేల్): అధికారుల అలసత్వం.. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అక్రమ మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా మండలంలోని కుకునూరువల్లి, తిప్పారం, ముద్దాపూర్, మేదినీపూర్ గ్రామ శివారుల్లో కాల్వల పక్కన పెద్ద ఎత్తున మట్టి కుప్పలు పోశారు. గజ్వేల్, కుకునూరువల్లి మండలాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లు, ఇతరత్ర పనులకు ఈ మట్టిని ఉపయోగిస్తున్నారు. కుకునూరుపల్లి, లకుడారం, మేదినీపూర్, తిప్పారం గ్రామ శివారుల్లో రియల్టర్లు ఎకరాల కొద్ది వ్యవసాయ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా వెంచర్లు చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఇటాచీలు, జేసీబీలతో మట్టిని తీస్తూ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. రోజుకు రూ. లక్షల్లో దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ప్రచారం సాగుతోంది. మట్టి దందా బయటకు తెలియకుండా పెలవ రోజుల్లో రాత్రి సమయంలో టిప్పర్లతో రోజూ వందలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. నిత్యం రాజీవ్ రహదారిపై నిత్యం దందా సాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దందా సాగుతుండటంతో మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్లు అతివేగంగా వెళ్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర కిలో మీటర్ వరకు టిప్పర్లు రాంగ్ రూట్‌లో వెళ్తుండడంతో పోలీసులు సైతం చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో అభివృద్ధి పనుల కోసం ఎక్కడా పిడికెడు మట్టి దొరకని పరిస్థితి నెలకొనే అవకాశం లేకపోలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల పక్కన ఉన్న మట్టి అక్రమ తరలింపు విషయమై ఇరిగేషన్ శాఖ మండల ఏఈ భాగ్యలక్ష్మి పలుమార్లు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది కొరతతో మట్టి తరలింపును ఆపడం కుదరడం లేదని చెబుతున్నారని తెలిపారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి అక్రమ మట్టి దందాను అరికట్టి ప్రకృతి సంపద తరిగిపోకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డిని వివరణ కోరగా కాలువ పక్కన మట్టి తరలిపోకుండా చూసుకునే బాధ్యత ఇరిగేషన్ శాఖ అధికారులదేనని చెప్పడం గమనార్హం.

వెంకటాపూర్, నాగ్సాన్‌పల్లిలో 95శాతం పోలింగ్



నాగ్సాన్‌పల్లిలో ఓటు వేసేందుకు వరుసలో ఉన్న మహిళలు (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో వెంకటాపూర్(ఆర్), నాగ్సాన్‌పల్లి గ్రామాల్లో శాసనసభ ఎన్నికల్లో 95శాతానికి పైగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీలు ఉండగా 39 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 28,528 మంది ఓటర్లు ఉన్నారు. గురువారం జరిగిన ఎన్నికల్లో 25,665 ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో కౌడిపల్లి, వెల్మకన్న గ్రామాలను మోడల్ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేసి ముస్తాబు చేశారు. మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో 95.683 శాతంతో 556 మంది ఓటర్లు ఉండగా 532 ఓటు వేశారు. నాగ్సాన్‌పల్లిలో 95.204 శాతంతో 563 ఓటర్లకు 536 ఓటు హక్కును వినియోగించుకున్నారు. తక్కువగా మండలంలోని పీర్యతండాలో 81.967 శాతంతో 366 మందికి గాను 300 ఓటు వేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దశంకరంపేటలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా వైద్యురాలు వేదశ్రీ మాట్లాడుతూ.. ఎయిడ్స్ గురించి ప్రజలు తెలుసుకోవాలని, దానికి ప్రభుత్వ ప్రత్యేకంగా వైద్య సదుపాయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ గ్రేస్, హెచ్ఈ శ్రీదేవి, ఎంపీహెచ్ఈఓ యాదయ్య, వెంకటేశం, రమా, సంతోష తదితరులు పాల్గొన్నారు.

వడ్లకుప్పకు బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



సంఘటన స్థలం వద్ద అపస్మారక స్థితిలో నాగరాజు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. శుక్రవారం రాత్రి రోడ్డుపై ఏర్పాటు చేసిన ధాన్యం కుప్పతో ప్రమాదం చోటు చేసుకుంది. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్క గ్రామానికి చెందిన గుమ్మడి నాగరాజు బైక్‌పై గ్రామం నుంచి సికింద్లాపూర్ వైపుకు వెళ్తుండగా రోడ్డుపై ఏర్పాటు చేసిన ధాన్యం కుప్పకు ఢీకొని తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడిపోయాడు. సర్పంచ్ లావణ్యమాధవారెడ్డి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇష్టారాజ్యంగా రోడ్లపై ధాన్యం కుప్పలు ఏర్పాటు చేస్తుండడంతో వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

శిలాన్యాసానికి ఆహ్వానం



విశ్వంజీ మహారాజ్‌కి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ట్రస్టు సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో నెలకొల్పనున్న శ్రీ గురు పీఠం శిలాన్యాసానికి హాజరు కావాలని శ్రీ విశ్వ గురు పీఠాధీశ్వరులు విశ్వయోగి విశ్వంజీ మహారాజ్‌ని శుక్రవారం ఆహ్వానించారు. ఇక్కడ శ్రీ గురుపీఠం నిర్మించేందుకు హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ ముందుకొచ్చారు. అందులో భాగంగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్‌ని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. శ్రీ గురుపీఠం శిలాన్యాసం ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు శివకుమార్‌గౌడ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, శ్రీ గురుపీఠం ట్రస్టు సభ్యులు మోహన్‌రావు ఉన్నారు.

'సురభి'లో ఉచిత వైద్య సేవలు



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లిలోని సురభి మెడికల్ కళాశాలకు అనుబంధంగా సిద్దిపేటలో నూతనంగా ప్రారంభమైన సురభి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈనెల 10వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శివరామచారి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పది రోజులపాటు ఉచిత వైద్యం అందించడంతో పాటు ల్యాబ్ పరీక్షల్లో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు. ఇతర మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల కంటే తక్కువ ఫీజులతో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలు వినియోగించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చన, అలంకరణ, ఆరాధన, వాసుదేవ పుణ్యావాచనం, కల్యాణోత్సవం వైభవంగా చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు , భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కిష్టయ్య ఆశయాలను కొనసాగిద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మలిదశ తెలంగాణ పోరాటంలో వీర మరణం పొందిన కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ ఆశయాలను కొనసాగిద్దామని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ 14 వర్ధంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు జంగిటి శ్రీనివాస్, భైరి శంకర్, పార్వతి భైరయ్య, పైసా రామకృష్ణ, గాడిచెర్ల సతీష్, తొట్ల పర్శరములు, పడిగే ప్రశాంత్, పాతర్ల వెంకటేశ్వర్లు, బోనాల నాగరాజు, బోనాల శ్రీనివాస్, నూతరి రాజు, గాడిచెర్ల యాదగిరి పాల్గొన్నారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని శుక్రవారం చిన్నకోడూరులో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడు కిష్టయ్య అని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశం, నాయకులు నారాయణ, సుధాకర్, శ్రీకాంత్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.